సాక్షి
కుమురం భీం

గురువారం । 5 । డిసెంబర్ । 2024

కృష్ణం వందే జగద్గురుం



ఆదిలాబాద్ కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో ఈ నెల 1 నుంచి జాతర ప్రారంభమైంది. గురువారం రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో▸



పింఛన్ల పంపిణీలో అవినీతి

జిల్లాలో ఆసరా పెన్షన్ల పంపిణీలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. పెన్షన్లు ఇచ్చే బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌లు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
29.6 /22.6

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

ఎదురుచూపులే..!



రెబ్బెన మండలం గంగాపూర్‌కు చెందిన లెండుగూరే బాపురావు స్థానిక బ్యాంకుల్లో రూ.3.30లక్షల పంట రుణం తీసుకున్నాడు. తన భార్య పేరు మీద మరో రూ.54వేలు తీసుకున్నాడు. రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాలు తిరిగి బ్యాంకుల్లో చెల్లిస్తే రూ.2లక్షలు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అధిక వడ్డీకి అప్పు చేసి రూ.1.84లక్షలు బ్యాంకుల్లో కట్టాడు. తాజాగా ప్రభుత్వం నాలుగో విడత రుణమాఫీ చేయగా.. ఆ జాబితాలో బాపురావు, అతడి భార్య పేర్లు లేకపోవడంతో నిరాశకు గురయ్యారు. బ్యాంకుల్లో చెల్లించేందుకు తెచ్చిన అప్పుకు వడ్డీ తడిసి మోపెడవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఇలా జిల్లాలో వేలాది మంది రైతులు బ్యాంకుల్లో అధికంగా ఉన్న రుణాలు చెల్లించి మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు.

- మాఫీ కాని రూ.2లక్షలకు పైగా తీసుకున్న రుణాలు
- అప్పులు చేసి బ్యాంకుల్లో చెల్లించిన రైతులు
- నాలుగో జాబితాలో పేర్లు లేకపోవడంతో నిరాశ
- వడ్డీ భారం పడుతుందని ఆవేదన

రెబ్బెన(ఆసిఫాబాద్): అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలో భాగంగా ప్రభుత్వం నాలుగు విడతల్లో రుణమాఫీ చేపట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల వరకు వందశాతం రుణాలు మాఫీ చేసినట్లు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఇదే చివరి విడత అంటూ తన ప్రసంగంలో వ్యాఖ్యానించడంతో మాఫీ కాని రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటివరకు రూ.2లక్షల వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేయగా.. అంతకు మించి తీసుకున్నవి మాఫీ కాకపోవటంతో అన్నదాతలు అయోమయంలో పడ్డారు. రూ.2లక్షలకు పైన ఉన్న మొత్తాన్ని బ్యాంకుల్లో చెల్లిస్తే మిగిలిన రూ.2లక్షలు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో చాలామంది అప్పులు చేసి చెల్లించారు. తాజా జాబితాలో పేర్లు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

వడ్డీలకు అప్పులు తెచ్చి..

జిల్లాలో సుమారు 1.30 లక్షల మంది రైతులు ఉన్నారు. ప్రభుత్వం మొదటి విడతలో రూ.లక్షలోపు, రెండో విడతలో రూ.1.5లక్షల లోపు, మూడో విడతలో రూ.2లక్షల లోపు పంట రుణాలు మాఫీ చేసింది. అనేక కారణాలతో రూ.2లక్షల లోపు రుణాలు తీసుకున్న రుణాలు మాఫీ కాకపోవడంతో కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం వివరాలు సేకరించింది. వ్యవసాయశాఖ అధికారులు క్లస్టర్ల వారీగా వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించారు. రేషన్‌కార్డులు లేని రైతులు, ఆధార్‌కార్డులో ఉన్న పేర్లతో పట్టాదారు పాస్ పుస్తకాలు, బ్యాంకు ఖాతా పుస్తకాల్లో ఉన్న పేర్లకు సరిపోకపోవడం వంటి కారణాలతో చాలామందికి ఇబ్బందులు ఎదురయ్యాయి. సాంకేతిక సమస్యలు సవరించి నాలుగో విడత అమలు చేశారు. రూ.2లక్షల వరకు రుణాలు తీసుకున్న వారికి మాత్రమే రుణమాఫీ అమలు కాగా, ఆపై తీసుకున్న వారిలో ఆందోళన మొదలైంది. కొంతమంది సుమారు రూ.4లక్షల వరకు అప్పు తెచ్చి రూ.2లక్షలకు పైగా రుణాన్ని బ్యాంకుల్లో చెల్లించారు.

మరో జాబితా ఉంటుందా..?

జిల్లాలో సుమారు 1.19 లక్షల మంది పంట రుణాలు తీసుకున్నట్లు అంచనా. రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న వారు 22 వేల మంది, రూ.1.5 లక్షల లోపు తీసుకున్న వారు 14,623 మంది ఉన్నారు. మూడు విడతల్లో 51,523 మంది రైతుల ఖాతాల్లో రూ.465.84 కోట్లు జమయ్యాయి. తాజాగా నాలుగో విడత కింద 3,664 మంది ఖాతాల్లో రూ.41.30 కోట్లు జమ చేయనున్నారు. ఈ నాలుగు విడతల్లోనూ చాలా మంది అర్హులు రుణమాఫీకి దూరమయ్యారు. ప్రభుత్వం ఐదో విడత విడుదల చేస్తుందా లేక ఇదే చివరిదా అని ఆందోళన మొదలైంది. రూ. 2లక్షల లోపు రుణాలు తీసుకుని మొదటి మూడు విడత జాబితాల్లో పేరు దక్కనివారికి నాలుగో విడత ద్వారా మాఫీ చేసినట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు. రూ.2లక్షలకు పైగా ఉన్న మొత్తాలను తిరిగి బ్యాంకుల్లో చెల్లించిన రైతులకు త్వరలోనే మాఫీ అవుతుందని అంటున్నారు. అయితే ప్రభుత్వం నుంచి మాత్రం స్పష్టత లేదు. ఇంకా 25 నుంచి 30 శాతం వరకు మాఫీ జరగలేదని రైతులు అంటున్నారు.

ఏఈవోలను సంప్రదించాలి



ప్రభుత్వం రూ.2లక్షల లోపు తీసుకున్న రైతుల రుణాలను మాఫీ చేసింది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో జిల్లాలో 3,664 మంది రైతులకు రూ.41.30 కోట్ల రుణాలను మాఫీ చేసింది. రూ.2లక్షలకు పైన రుణాలపై పభుత్వం నిర్ణయం తీసుకుంది. రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ కాని వారు సంబంధిత క్లస్టర్ ఏఈవోలను సంప్రదించాలి.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



నారాయణపూర్‌లో తేమ తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర దక్కడంతోపాటు సన్నరకం వరి ధాన్యానికి అదనంగా బోనస్ లభిస్తుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. రెబ్బెన మండలం నారాయణపూర్‌లోని రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. ధాన్యం తేమ, నాణ్యతను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గన్నీ సంచులు, టార్పాలిన్ల కొరత లేకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. రైతులు దళారులను నమ్మి నష్టపోవద్దని సూచించారు. తేమ 17శాతానికి మించకుండా పూర్తిస్థాయిలో ఆరబెట్టాలన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు, వంటశాల, నిత్యావసర సరుకుల నాణ్యత, రిజిస్టర్లను పరిశీలించారు. మెనూ ప్రకారం పోషకాహారం అందించాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సమగ్ర సర్వే వివరాల డాటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో శంకరమ్మ, ఎంపీవో వాసుదేవ్, ఏపీఎం వెంకటరమణ తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా న్యాస్ పరీక్ష



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో బుధవారం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్) పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతంపై ఆరా తీశారు. 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన న్యాస్ పరీక్షకు జిల్లాలో 80 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 4,492 మంది విద్యార్థులకు 3వ తరగతిలో 846 మంది, 6వ తరగతిలో 876 మంది, 9వ తరగతిలో 1056 మంది హాజరయ్యారు. మొత్తం 2,779 మంది హాజరు కాగా, 1,713 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణ అధికారి తెలిపారు. 2021లో నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా చివరిస్థానంలో నిలిచిన విషయం తెలిసిందే.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా అధికారి

కౌటాల(సిర్పూర్): వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేశ్‌కుమార్ హెచ్చరించారు. కౌటాల పశువైద్యశాలను బుధవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని గడువులోగా పూర్తిచేయాలన్నారు. ఫిబ్రవరి వరకు వివరాల సేకరణ పూర్తిచేయాలన్నారు. పశువైద్యశాలల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. మండల పశువైద్యాధికారి శ్రీకాంత్, సిబ్బంది సందీప్ తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్ నమోదు పూర్తిచేయాలి



పరిశీలిస్తున్న డీపీవో భిక్షపతి

వాంకిడి(ఆసిఫాబాద్): కుటుంబ సమగ్ర సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగుతున్న సర్వే కంప్యూటరీకరణను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అదనపు కంప్యూటర్లను సమకూర్చుకుని ఆపరేటర్లను నియమించాలని సూచించారు. రాత్రుల్లోనూ ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగించాలన్నారు. తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీవో అజీజుద్దీన్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ చైర్మన్‌గా రావూరి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడిగా మిలింద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా యుగంధర్, సంయుక్త కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా మంజుల, ఉపాధ్యక్షులుగా ప్రేమలత, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా గోపికాంత్, గిరీశ్‌ను ఎన్నుకున్నారు. సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు సన్మాన్ నాయక్, ప్రధాన కార్యదర్శి తిరుపతి నాయక్, సభ్యులు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ నిర్వహించారు.

రేపు అభ్యర్థనల స్వీకరణ

ఆసిఫాబాద్‌అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కల్పించాల్సిన రిజర్వేషన్ల కోసం తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేషన్ కమిషన్ ఈ నెల 6న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంఘాల ప్రతినిధుల నుంచి అభ్యర్థనలు, ఆక్షేపణలు స్వీకరిస్తుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బీసీ కులస్తులు, బీసీ సంఘాల నాయకులు సకాలంలో హాజరై తమ అభ్యర్థనలు, ఆక్షేపణలు, సలహాలు తెలియజేయాలని సూచించారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం



మహారాష్ట్ర ప్రాంతంలో తెలంగాణ మందులు



గడువు తీరకముందే పడేసిన మందుల డబ్బా

- జిల్లా సరిహద్దులోని మహారాష్ట్రలో తెలంగాణ మెడిసిన్
- చెత్త కుప్పగా పారబోసిన వైనం

వాంకిడి(ఆసిఫాబాద్): కొంతమంది అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రభుత్వ వైద్యం ప్రజలకు దూరమవుతోంది. తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేసే పలురకాల మందులు, మాత్రలు, ఇతర వైద్య సామగ్రి సరిహద్దులోని మహారాష్ట్రలో గల లకడ్‌కోట్ గ్రామ సమీపంలో రోడ్డు పక్కన చెత్తలో దర్శనం ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. వాంకిడి మండలానికి చెందిన కొందరు మహారాష్ట్రకు వెళ్తుండగా రోడ్డు పక్కన పడిఉన్న మందులను గుర్తించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అక్కడే ఆర్‌బీఎస్‌కేకు సంబంధించిన లాగ్‌బుక్ రిసిప్ట్ కూడా లభ్యమైంది. దీంతో ఆర్‌బీఎస్‌కే సిబ్బందిపైనే పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల విద్యార్థుల కోసం ఆర్‌బీఎస్‌కే..

పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ఆర్‌బీఎస్‌కే వ్యవస్థను ఏర్పాటు చేసింది. కాంట్రాక్ట్ పద్ధతిన సిబ్బందిని నియమించి బడి పిల్లలకు నిత్యం వైద్యం అందించేందుకు ఒక వాహనాన్ని సైతం కేటాయించింది. పిల్లల్లో పుట్టుకతో, జన్యుపరంగా సంక్రమించే వ్యాధులను గుర్తించి ప్రారంభ దశలోనే నివారించేలా చర్యలు తీసుకోవడం ఆర్‌బీఎస్‌కే ప్రాథమిక లక్ష్యం. చిన్నపాటి అనారోగ్య సమస్యలకు అప్పటికప్పుడు మందులు, మాత్రలు, ఇంజెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు. మహారాష్ట్రలో పడేసిన మందుల కుప్పలో లభ్యమైన లాగ్‌బుక్ రిసిప్ట్‌లో సెప్టెంబర్‌– 2023, ఆర్‌బీఎస్‌కే టీం 'బి'గా.. వాహనం నంబరు టీఎస్20 టీ 2096గా నమోదై ఉంది. మాత్రలు, ఇంజెక్షన్‌లు, ఐ డ్రాప్స్, సిరంజీలు, సిరప్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తదితరాలు వినియోగించకుండానే పడేశారు. అందులో ఎక్కువ మందులు గడువు తీరనవి ఉన్నాయి. నిబంధనల ప్రకారం మందులు గడువు ముగిసినా బహిరంగ ప్రాంతాల్లో పడేయకూడదు. స్థానికంగా వేస్తే సమస్యలు తలెత్తుతాయని సరిహద్దు సమీపంలోని మహారాష్ట్ర ప్రాంతంలో పడేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై డీఎంహెచ్‌వో సీతారాంను ఫోన్‌లో వివరణ కోరగా.. మహారాష్ట్రలో మందులు పడేసిన ఘటనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'హిందువులపై దాడులు సరికాదు'



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు సరికాదని హిందూ ఐక్యవేదిక సంఘం నాయకులు అన్నారు. బంగ్లాదేశ్‌లో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, హత్యలను ఖండిస్తూ జిల్లా కేంద్రంలోని వివేకానందచౌక్ నుంచి కలెక్టరేట్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందించారు. సంఘం ప్రతినిధులు అరిగెల నాగేశ్వర్‌రావు, రేగుంట కేశవ్‌రావు, ఖాండ్రె విశాల్ మాట్లాడుతూ ఇస్కాన్ ప్రతినిధి కృష్ణదాస్‌ను బంగ్లాదేశ్ ప్రభుత్వం అరెస్టు చేసి జైలుకు పంపడం అన్యాయమన్నారు. దాడులు అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు మల్లికార్జున్, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, గణేశ్, నాగరాజ్, సత్యనారాయణ, మహేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కంపించిన భూమి

- కౌటాల, చింతలమానెపల్లిలో స్వల్ప ప్రకంపనలు

కౌటాల/చింతలమానెపల్లి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం భూప్రకంపనలు స్థానికులను భయాందోళనకు గురిచేశాయి. కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లో ఉదయం 7.27 నుంచి 7.30 మధ్య భూకంప తీవ్రతతో భూమి కంపించింది. ఇళ్లలోని వస్తువులు కదలడంతో ప్రజలు బయటికి పరుగులు తీశారు. బాబాసాగర్, చింతలమానెపల్లి, ఖర్జెల్లి, మరికొన్ని గ్రామాల్లో ఇళ్ల గోడలకు బీటలు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: ఫిక్స్‌డ్ వేతనంగా రూ.18వేలు చెల్లించాలని జిల్లాలోని ఆశవర్కర్లు బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశవర్కర్లు 20 ఏళ్లగా పనిచేస్తున్నారని తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఫిక్స్‌డ్ వేతనం, ఈఎస్‌ఐ, పీఎఫ్ అమలు చేస్తూ, లెప్రసీ, పల్స్ పోలియో, టీబీ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన డీఎంహెచ్‌వో సీతారాం ధర్నా శిబిరానికి చేరుకున్నారు. లెప్రసీ, పల్స్ పోలియో డబ్బులు 50 శాతం చెల్లిస్తామని, కుష్ఠు సర్వేలో పాల్గొనాలని సూచించారు. కార్మికులు మాత్రం పూర్తిస్థాయిలో నగదు చెల్లిస్తేనే సర్వేకు సహకరిస్తామని స్పష్టం చేశారు. ధర్నాకు బీజేపీ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, మల్లికార్జున్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, కృష్ణమాచారి, భాగ్య, పంచశీల, అనిత, అరుణ, సురేఖ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

'ఆ పార్టీలకు ప్రజలే బుద్ధి చెప్తారు'



మాట్లాడుతున్న కోట్నాక తిరుపతి

రెబ్బెన(ఆసిఫాబాద్): ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలుచేసే దిశగా చర్యలు తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారం చేస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు ప్రజలే తగిన బుద్ధి చెప్తారని గిరిజన సహకార సంఘం చైర్మన్ కోట్నాక తిరుపతి, ట్రైబల్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని కేకే గార్డెన్స్‌లో బుధవారం ప్రజాపాలన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతే ఉన్నా రూ.2లక్షల వ్యవసాయ రుణాలు మాఫీ చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తికాక ముందే 54,153 ఉద్యోగాలను భర్తీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల కల సాకారం చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌పై ప్రజలు విశ్వాసంతో ఉన్నారని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే ప్రజాపాలనకు ప్రభుత్వానికి సహకరించాలని హితువు పలికారు. డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్, మండల అధ్యక్షుడు రమేశ్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌రావు, నాయకులు అనిల్‌గౌడ్, ఆత్మారాం నాయక్, దేవాజీ, సోమయ్య, సంతోష్, ప్రకాష్‌రావు, సుదర్శన్‌గౌడ్, హరీశ్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

బెజ్జూర్(సిర్పూర్): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల గిరిజన పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులతో వంటలు చేయాలని ఆదేశించారు. కేజీబీవీలో తాజా కూరగాయలు లేకపోవడంతో వాటిని సరఫరా చేసే వారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని తహసీల్దార్ భూమేశ్వర్‌ను ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సమగ్ర సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. వివరాల నమోదు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఎంపీడీవో గౌరీ శంకర్, ఆర్‌ఐ సంతోష్, కేజీబీవీ ప్రత్యేకాధికారి అరుణ, సీనియర్ అసిస్టెంట్ అచ్యుత్‌రావు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు

- ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. ఆస్పత్రిలోని తన చాంబర్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్య విధాన పరిషత్ నుంచి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లోకి మారినట్లు తెలిపారు. ఈసీజీ, డయాలసిస్ చికిత్సలతోపాటు జనరల్ సర్జరీ, ఆర్థో, ఈఎన్‌టీ, కంటి శస్త్రచికిత్స అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రిలో ప్లాస్టిక్ సర్జరీ వైద్యుడు, ఇద్దరు ఆర్థోపెడిక్, జనరల్ ఇద్దరు, ఈఎన్‌టీ ఇద్దరు, అప్తమాలజీ ఇద్దరు వైద్యులతోపాటు అన్నివిభాగాల్లో 30 మందికి పైగా ఉన్నారని తెలిపారు. ప్రతిరోజూ సుమారు 500 మందికి పైగా ఔట్ పేషెంట్లుగా నమోదవుతున్నారని అన్నారు. నర్సింగ్ కళాశాల, ఎన్‌సీడీ క్లినిక్ అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

సిర్పూర్(టి): మండలంలోని దుబ్బగూడ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ తనిఖీ చేశారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని పరిశీలించారు. కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఏపీఎం దుర్గయ్య, సీసీ రాజేశ్ తదితరులు ఉన్నారు.

ఏజెన్సీలో పెద్దపులి సంచారం

ఆసిఫాబాద్: జిల్లాలో పెద్దపులులు బెంబేలెత్తిస్తున్నాయి. ఇటీవల సిర్పూర్‌– టి, కాగజ్‌నగర్ అడవుల్లో అలజడి సృష్టించగా, తాజాగా బుధవారం ఉదయం ఏజెన్సీ ప్రాంతాల్లో సంచరించినట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్ మండలంలోని కొటగూడ ప్రాంతంలో పులిపాదముద్రలు గుర్తించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎఫ్‌ఆర్వో గోవింద్‌సింగ్ సర్దార్, డిప్యూటీ రేంజ్ అధికారి యోగేశ్, సిబ్బంది పాదముద్రలను ఆధారంగా పులి సంచారాన్ని పరిశీలించారు. కొటగూడ, గంటలగూడ మీదుగా అడదస్నాపూర్ నుంచి కెరమెరి మండలం జోడేఘాట్ అడవులకు వెళ్లినట్లు నిర్ధారించారు. మంగళవారం సాయంత్రం ఇప్పలనవగాం ప్రాంతంలో ఉన్న పులి.. అక్కడి నుంచి బుధవారం ఉదయం ఏజెన్సీలో తిరిగినట్లు తెలుస్తోంది. పులి సంచారాన్ని అధికారులు ధ్రువీకరించారు.

జాతీయస్థాయికి ఎంపిక



విద్యార్థితో ప్రిన్సిపాల్ శ్రీనివాస్

సిర్పూర్(టి): సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఎంఏ బాబర్ బేగ్ 68వ జాతీయస్థాయి ఎస్జీఎఫ్ అండర్‌– 19 హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం విద్యార్థిని అభినందించారు. రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటినట్లు తెలిపారు. ఈ నెల 12 నుంచి పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు.

క్లుప్తంగా

జ్వరంతో యువతి మృతి



శ్రీదేవి (ఫైల్)

ఇంద్రవెల్లి: జ్వరంతో యువతి మృతి చెందింది. ఈ ఘటన బుధవారం మండలంలోని పిట్టబొంగరం గ్రామపంచాయతీ పరిధి ఓల్‌మద్రి గ్రామంలో చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్‌మద్రి గ్రామానికి చెందిన వెట్టి జాకు, భారతీబాయి దంపతుల కూతురు శ్రీదేవి (19) మూడునెలలుగా తిర్యాణి మండలంలోని బంధువుల వద్ద ఉంటోంది. 15 రోజులుగా జ్వరంతో బాధ పడుతుండగా బంధువులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. రెండు రోజుల క్రితం ఓల్‌మద్రి గ్రామానికి తీసుకువచ్చి మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున శ్రీదేవి ఇంట్లోనే మృతి చెందింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలం పిప్పర్‌వాడకు చెందిన మేకల అశోక్ (51) మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందినట్లు జైనథ్ ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్ కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే పూసాయి గ్రామానికి కూలీ పనికోసం వెళ్లి రాత్రి 8.30 గంటల ప్రాంతంలో తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ తలతో పాటు పలు శరీర భాగాలకు తీవ్రగాయాలైనట్లు పేర్కొన్నారు. దీంతో ఘటనాస్థలిలోనే మృతిచెందినట్లు వివరించారు. మృతుడి కుమారుడు ఆకాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గని కార్మికుడికి గాయాలు

కాసిపేట: మందమర్రి ఏరియాలోని కాసిపేట–1 ఇంక్‌లైన్ గనిలో బుధవారం ఉదయం జనరల్ మజ్దూర్ జరుపుల శ్రీనివాస్ చేతి వేలికి తీవ్ర గాయాలు కాగా రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహించే శ్రీనివాస్ ఫ్రీ షిఫ్టులో ఉదయం 4గంటలకు విధులకు హాజరయ్యాడు. ప్యానల్ త్రీ ఎస్ లెవెల్ 11డిస్ట్రిక్ట్‌లో వెల్డింగ్ హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 8గంటలకు గ్యాస్ సిలిండర్ లాగే క్రమంలో ఎడమ చేతి బొటనవేలు రెండు సిలిండర్ల మధ్య ఇరుక్కుని తీవ్రగాయమైంది. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. శ్రీనివాస్‌ను ఏఐటీయూసీ నాయకులు మినుగు లక్ష్మీనారాయణ, పార్వతి సురేశ్, మైన్ కమిటీ నాయకులు పరామర్శించారు. అధికారులు ఫ్రీ షిఫ్టుల పేరుతో కార్మికులను ఒత్తిడి గురిచేయడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. తెల్లవారుజామున 4గంటలకు లేచేందుకు రాత్రి నిద్రపోకుండా గడపాల్సి వస్తోందని తెలిపారు. పని స్థలంలోనూ వచ్చే షిఫ్టు వారికోసం ఏర్పాట్లు చేస్తూ ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోందని వాపోతున్నారు. రక్షణపై ప్రతీరోజు చెప్పే అధికారులకు ఫ్రీ షిఫ్టుల ఒత్తిడి కనిపించడం లేదనే విమర్శలున్నాయి. గతంలోనూ ఫ్రీ షిఫ్టులో కార్మికుడు గుండెపోటుతో మృతిచెందాడు.

గోదావరికి పంచహారతి



గంగాహారతి ఇస్తున్న అర్చకులు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయ వైదిక బృందం ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు ఆదేశాల మేరకు బుధవారం గోదావరినది ఘాట్–1 వద్ద పంచహారతి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

కృష్ణం వందే జగద్గురుం

- గోపాలకృష్ణ మఠం జాతర షురూ..
- శతాబ్దాలుగా నిర్వహిస్తున్న ఉత్సవం
- మఠానికి నాలుగు శతాబ్దాల చరిత్ర
- నేడు కనుల పండువగా రథోత్సవం



పూజలందుకుంటున్న సత్యభామ రుక్మిణీ సమేత గోపాలకృష్ణస్వామి (ఫైల్)



శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం

ఆదిలాబాద్: 400 ఏళ్ల చరిత్ర.. ఆలయంలోనే మఠాధిపతుల సమాధులు.. ద్వారకలో రూపుదిద్దుకున్న స్వామివారి విగ్రహం.. నాలుగు శతాబ్దాల వయస్సుగల మర్రి వృక్షం.. ఇలా చెప్పుకొంటూ పోతే ఆ ఆలయానికి ఎన్నో ప్రత్యేకతలు. ఆ దేవాలయమే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం. ఈ కోవెలకు ఎంతో విశిష్టత ఉంది. నిత్య పూజలు అందుకునే సత్యభామ రుక్మిణీ సమేత గోపాలకృష్ణ ఆలయంలో ఏటా మార్గశిర మాసంలో జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ఈనెల 1న జాతర ప్రారంభం కాగా, నేడు రథోత్సవాన్ని నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మఠం చరిత్రను పరిశీలిస్తే..

వ్యవస్థాపకులైన శ్రీపూర్ణానంద సరస్వతి స్వామీజీ 400 ఏళ్ల క్రితం ఉత్తర భారతం నుంచి సంచరిస్తూ ప్రస్తుతం మఠం ఉన్న ప్రాంతంలో ప్రకృతి సౌందర్యానికి ముగ్ధులై ఇక్కడే ఉన్న మర్రి వృక్షాన్ని ధ్యాన స్థావరంగా చేసుకున్నారు. మఠాన్ని ఏర్పాటు చేసుకుని ఇక్కడే తపస్సును ఆచరించారు. స్వామీజీ

వైవిధ్యం విగ్రహ ప్రతిష్ఠాపనం

మఠంలో కొలువుదీరిన స్వామివారి మూర్తిని శాలిగ్రామంతో రూపొందించారు. శతాబ్దాల క్రితం ఎలాంటి వాహనాలు ఉపయోగించకుండా ద్వారక నుంచి స్వామి వారి విగ్రహాన్ని తీసుకువచ్చినట్లు చరిత్ర చెబుతోంది. భక్తులు ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి.. అడవులు, కొండలు, కోనలు, నదులు, వాగులు దాటుతూ శ్రేణిలా ఏర్పడి చేతుల మీదుగా విగ్రహాన్ని ఇక్కడి వరకు చేర్చినట్లు తెలుస్తోంది. ఆలయంలో దుర్గాదేవి, సీతారాములు, విఠల రుక్మాబాయి విగ్రహాలు దర్శనమిస్తాయి.

తపస్సు ఆచరించిన వట వృక్షం ఇప్పటికీ ఉండడం విశేషం. స్వామీజీ తన చివరి రోజుల్లో మఠానికి తొలి ఉత్తరాధికారిగా శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామిని నియమించారు. ఇప్పటివరకు ఎనిమిది మంది ఉత్తరాధికారులుగా వ్యవహరించగా, ప్రస్తుతం శ్రీ యోగానంద సరస్వతి స్వామి పదో మఠాధిపతిగా కొనసాగుతున్నారు. మఠ వ్యవస్థాపకులు పూర్ణానంద సరస్వతి స్వామితో పాటు ఎనిమిది మంది ఉత్తరాధికారుల సమాధులు కూడా ఆలయ ప్రాంగణంలోనే ఉండటం ప్రత్యేకతను చాటుతోంది.

జాతర నిర్వహిస్తారిలా..

మఠ వ్యవస్థాపకులు శ్రీ పూర్ణానంద సరస్వతి స్వామి పుణ్యతిథిని పురస్కరించుకుని జాతర మహోత్సవాలు ఆరంభమవుతాయి. మార్గశిర మాసంలో అమావాస్య నుంచి ఐదురోజులపాటు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. తొలిరోజైన అమావాస్య రోజున మఠాధిపతిగా వ్యవహరించే స్వామీజీ భిక్ష గ్రహణం చేస్తారు. రెండోరోజు ఉదయం అభిషేకంతో పాటు రాత్రి సమయంలో అశ్వవాహన సేవ ఉంటుంది. మూడోరోజు పూర్ణానంద సరస్వతి స్వామీజీ పుణ్య తిథి నిర్వహిస్తారు. అలాగే గజ వాహన సేవ ఉంటుంది. నాలుగోరోజు హనుమత్, గరుడ వాహన ఉత్సవాలుంటాయి. ఐదోరోజు బలిహరణం, రథ పూజ చేసి సత్యభామ రుక్మిణీ సమేత గోపాలకృష్ణమూర్తి, పూర్ణానంద సరస్వతి స్వామి మూర్తులతో రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని వీక్షించడానికి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు. అనంతరం జాతర పది రోజుల పాటు కొనసాగుతుంది.

కేజీబీవీలకు కార్పెట్లు, దుప్పట్లు



కేజీబీవీ తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థినులు (ఫైల్)

- ఈ నెల 15లోపు సరఫరా
- విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా...

జిల్లా	కేజీబీవీలు	విద్యార్థులు
ఆదిలాబాద్	18	4,422
కుమురంభీం	15	3,991
మంచిర్యాల	18	4,607
నిర్మల్	18	5,562

మంచిర్యాలఅర్బన్: కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయ (కేజీబీవీ)ల్లో విద్యార్థినులకు కార్పెట్లు, దుప్పట్లు, ఉలెన్ బ్లాంకెట్ల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ హ్యాండ్లూమ్ వీవర్స్ సొసైటీ నుంచి 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఈ నెల 15లోపు ఆయా కేజీబీవీలకు నేరుగా సరఫరా చేయనుంది. విద్యాలయాలకు చేరగానే సకాలంలో విద్యార్థులకు అందించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు వచ్చాయి. కాగా, గత నెల 27న 'చలిలోనూ చన్నీటి స్నానమే' శీర్షికన చలి తీవ్రతతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18,582 మంది విద్యార్థులకు కార్పెట్లు, దుప్పట్లు, బ్లాంకెట్లు మంజూరు చేసింది. చలి తీవ్రత క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో రెండేళ్ల తర్వాత విద్యార్థినులకు చలికి కప్పుకొనే రగ్గులు, నేలపై పరుచుకునే కార్పెట్లు, దుప్పట్లు రావడంతో ఊరటనిస్తోంది.

విద్యార్థులు ఎక్కువ.. సరఫరా తక్కువ

మంచిర్యాల జిల్లాలో 18 కేజీబీవీల్లో విద్యార్థులు చదువుతున్నారు. ఇదివరకు పంపిణీ చేసిన దుప్పట్లు, కార్పెట్లు, ఉలెన్ బ్లాంకెట్ల పంపిణీ గందరగోళంగా ఉండేది. కొత్తగా ప్రవేశాలు పొందిన ఇంటర్, ఆరో తరగతి విద్యార్థినులకు మాత్రమే సరఫరా చేసిన సందర్భాలున్నాయి. కొన్నింటిలో అసలే పంపిణీ కాని పరిస్థితి. విద్యార్థినులు ఎక్కువ ఉన్న చోట తక్కువ పంపిణీ చేయడంతో అయోమయం నెలకొంది. దుప్పట్లు, బ్లాంకెట్లు సరఫరా కాకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకోవాల్సి వస్తోంది.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోతారెడ్డి



పోతారెడ్డి

నేరడిగొండ: యువజన కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ అధ్యక్ష పదవికి ఆన్‌లైన్ ఓటింగ్ నిర్వహించగా బుధవారం ఫలితాలు విడుదలయ్యాయి. తేజాపూర్ గ్రామానికి చెందిన బద్దం పోతారెడ్డి విజయం సాధించారు. రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై ఆయన సంతోషం వ్యక్తంజేశారు. తన విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

జిన్నింగ్ మిల్లు కన్వేయర్ బెల్ట్‌పై పడి ఒకరు మృతి



పరశురాం (ఫైల్)

ఇంద్రవెల్లి: జిన్నింగ్ మిల్లు కన్వేయర్ బెల్టుపై పడి ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం మండలంలోని ఏమాయికుంట గ్రామంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏమాయికుంట పంచాయతీ పరిధి గలియబాయితండా సమీపంలోగల విజయలక్ష్మి జిన్నింగ్ మిల్లు పర్యవేక్షణ బాధ్యతను యజమాని తగ్రే జ్ఞానసింగ్ తండ్రి పరశురాం (55) చూస్తుంటాడు. రోజులాగే బుధవారం అతడు కూలీలతో పనులు చేయిస్తూ కన్వేయర్ బెల్ట్ వద్ద నిలిచిన పత్తిని తొలగిస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు బెల్ట్‌లో చేయి చిక్కుకుంది. తీవ్రంగా గాయపడిన అతడు స్పృహ కోల్పోయాడు. వెంటనే స్థానికులు అతడిని వాహనంలో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. మృత్యుడికి భార్య పులబాయి, మిల్లు యజమాని జ్ఞానసింగ్, కుటుంబీకులు నానక్, జగన్ ఉన్నారు.

సిలిండర్ పేలి పెంకుటిల్లు దగ్ధం



ప్రమాదంలో కాలిపోయిన ఇంటి సామగ్రి

ఇంద్రవెల్లి: ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి పెంకుటిల్లు దగ్ధమైంది. ఈ ఘటన బుధవారం మండలకేంద్రంలో జరిగింది. బాధిత కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రంలోని చిచ్‌ధరిఖానాపూర్ రోడ్ జామా మసీదు పక్కన నివాసముంటున్న షేక్ సలీం ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్ పైప్ లీకై మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే ఇంట్లోని బియ్యం, నిత్యావసరాలు, బట్టలు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.90వేల ఆస్తి నష్టం జరిగింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది. సీఐ నైలు తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా–నిర్మల్ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఎల్లమ్మ గుట్టపై ఇటీవలే చింతచెట్టుకు స్వయంభూగా దుర్గామాత వెలిసింది. రెండు నెలలుగా భక్తుల సంఖ్య పెరిగింది. భక్తుల కానుకలు స్వీకరించేలా ఆలయ కమిటీ నిర్వాహకులు అక్కడ హుండీలను ఏర్పాటుచేశారు. ఎప్పటిలాగే బుధవారం వేకువజామున భక్తులు ఆలయానికి వెళ్లగా హుండీలు కనిపించలేదు. విషయాన్ని ఆలయ కమిటీకి తెలపడంతో వారు చోరీ జరిగినట్లు గుర్తించారు. భక్తులు సమర్పించిన కానుకలను దొంగలు ఎత్తుకువెళ్లారు. అమ్మవారికి వెండితో తయారు చేయించిన తులన్నర వెండి ముక్కుపుడక, ఇతర కానుకలు అపహరించారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయిన పుటేజీలను పరిశీలించారు. రెండుబృందాలుగా ఏర్పడి త్వరలోనే దొంగలను పట్టుకుంటామని సీఐ నైలు తెలిపారు. ఆలయ పరిసరాల్లోని దృశ్యాలు, సీసీ పుటేజీలను పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బంగారం దుకాణంలో చోరీ



దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దివ్యనగర్ కాలనీలోగల లక్ష్మీప్రసన్న బంగారం దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుకాణం మూసేసి ఇంటికి వెళ్లిన యజమాని విశ్వనాథ్ బుధవారం ఉదయం దుకాణం తెరిచేందుకు షాప్ వద్దకు రాగా.. షెటర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దొంగతనం జరిగినట్లు గుర్తించి అతడు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనాస్థలికి చేరుకున్న సీఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నాలుగు కిలోల వెండి, రెండు తులాల బంగారం చోరీకి గురైనట్లు బాధితుడు పేర్కొన్నాడు. దుకాణంలోని సీసీ కెమెరాల్లోని హార్డ్ డిస్క్‌ను కూడా దుండగుడు ఎత్తుకెళ్లడం గమనార్హం.

బేల మార్ట్ నుంచి రూ.5.97లక్షలు చోరీ



వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్సై

బేల: మండల కేంద్రంలోని శ్రీకర్ మార్ట్‌లో బుధవారం సాయంత్రం రూ.5.97లక్షల నగదు చోరీకి గురైంది. మార్ట్ యజమాని నగదుతో ఉన్న ప్లాస్టిక్ కవర్‌ను కౌంటర్‌పై ఉంచి కొద్దిసేపు బయటకు వెళ్లాడు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఒకరు నగదుతో ఉన్న ప్లాస్టిక్ కవర్ అపహరించి పరారయ్యాడు. గమనించిన మార్ట్ యజమాని స్వరాజ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే అక్కడికి చేరుకున్న జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్సై దివ్యభారతి సీసీ కెమెరాల్లో రికార్డయిన పుటేజీలను పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన విఠల్ ద్విచక్ర వాహనం గత నెలలో చోరీకి గురైంది. వివరాలు.. విఠల్ కుమారుడి ఆరోగ్యం బాగా లేకపోవడంతో అతడిని రిమ్స్‌లో చేర్పించాడు. బైక్‌ను పార్కింగ్ స్థలంలో నిలిపాడు. మళ్లీ వచ్చేసరికి బైక్ కనిపించలేదు. చుట్టుపక్కలా గాలించినా దొరకలేదు. దీంతో బుధవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

ఆర్టీసీలో కుటుంబ వాతావరణం కల్పిస్తాం

- డిప్యూటీ ఆర్ఎం ప్రణీత్
- ముగిసిన వనభోజనాలు



మాట్లాడుతున్న డిప్యూటీ ఆర్ఎం ప్రణీత్

ఆదిలాబాద్: ఆర్టీసీలో కుటుంబ వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో వనభోజనాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆర్టీసీ ఆదిలాబాద్ డిప్యూటీ ఆర్ఎం ప్రణీత్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ డిపోలో బుధవారం వనభోజనాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగుల్లో ఒత్తిడి తగ్గించడానికి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే ఉద్యోగులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. సంస్థను ఓ కుటుంబంగా భావించి ప్రతి ఒక్కరూ స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలని సూచించారు. కుటుంబ సభ్యులు ఉద్యోగులకు అండగా నిలబడాలని కోరారు. సంస్థ నిర్దేశిస్తున్న లక్ష్యాల సాధనలో ఉద్యోగులు ఎంతగానో శ్రమిస్తున్నారని ప్రశంసించారు. ఆదిలాబాద్ రీజియన్ అగ్రస్థానంలో పయనించేలా ఎంతగానో పాటుపడుతున్నారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి సంస్థ ప్రగతికి తమ వంతు తోడ్పాటును అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శంకరయ్య, డిపో మేనేజర్ కల్పన, వెల్ఫేర్ బోర్డు మెంబర్ ప్రమీల, ఎంఎఫ్ శ్రీకర్, రిజర్వేషన్ ఇన్‌చార్జి అహ్మద్ హుస్సేన్, ఆర్ఎం ఆఫీస్ సిబ్బంది, ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏసీబీకి పట్టుబడిన మార్కెటింగ్ ఏడీ

- దడ్వాయి లైసెన్స్ కోసం రూ.7వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత



ఆదిలాబాద్ పట్టణంలోని నిర్మల్ మార్కెటింగ్ ఏడీ ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

నిర్మల్‌ఖిల్లా/ఆదిలాబాద్‌టౌన్: నిర్మల్ జిల్లాలో అవినీతి అధికారులు వరుసగా ఏసీబీకి పట్టుబడుతున్నారు. నెలరోజుల వ్యవధిలో ముగ్గురు లంచావతారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నిర్మల్ మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ దడ్వాయి లైసెన్స్ కోసం బుధవారం లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన కుమ్మరి వెంకటేశ్ దడ్వాయి లైసెన్స్ కోసం గత మార్చిలో దరఖాస్తు చేసుకున్నాడు. పలుసార్లు విన్నవించినా లైసెన్స్ ఇవ్వలేదు. లైసెన్స్ మంజూరు కోసం రూ.10వేలు డిమాండ్ చేశారు. చివరకు రూ.7 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. బుధవారం మధ్యాహ్నం జిల్లా మార్కెటింగ్ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. విచారణ అనంతరం నిందితుడిని ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. కాగా, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో ఉన్న శ్రీనివాస్ నివాసంలోనూ ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. పలు రికార్డులు, పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈయన గతంలో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ అధికారిగానూ పని చేశారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అండగా ఉంటాం



మహాసభలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు టీబీజీకేఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని యూనియన్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో బుధవారం బెల్లంపల్లి ఏరియా సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం మహాసభ నిర్వహించగా రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణిలో పని చేసే కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించేలా చూస్తామని, కనీస వేతనాల పెరుగుదలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల హక్కుల సాధనకు టీబీజీకేఎస్ ఉద్యమిస్తుందని తెలిపారు. 2022లో జరిగిన సమ్మె సందర్భంగా కార్మిక సంఘాల నాయకులతో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని, జీవో 22 ప్రకారం కనీస వేతనాలు పెంచాలని, సింగరేణిలో ఖాళీగా ఉన్న కంపెనీ క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు అలాట్ చేయాలని కోరారు. కోల్‌మైన్స్ రూల్స్ ప్రకారం లీవ్‌లు, ప్లేడేలు, పీహెచ్‌డీలు, ఓటీలకు వేతనాలు చెల్లించాలని, సీఎంపీఎఫ్ పర్మినెంట్ నంబర్లు కేటాయించి బ్యాలెన్స్ చిట్టీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బ్లాస్టింగ్, బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు అందించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సంఘం ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, సెంట్రల్ కమిటీ నాయకులు మంగీలాల్, చంద్రశేఖర్, శ్రీనివాస్, సమ్మయ్య, కిరణ్, సంపత్, పిట్ కార్యదర్శి రమేశ్, గణపతి, నాయకులు చందర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి విశేష పూజలు



హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారి ఆలయంలో ఆలయ వైదిక బృందం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రజలు, పాలకులు సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో శ్రీవ్యాస మహర్షి ఆలయంలో చండీ హోమం, అమ్మవారి ఉత్సవమూర్తులకు విశేష కుంకుమార్చన పూజ, నీరాజనం, మహా మంత్రపుష్ప కార్యక్రమాలను వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీజ్ఞాన సరస్వతీ మహాకాళీ, మహాలక్ష్మీ అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అమ్మవారి అన్నప్రసాదాన్ని అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు, స్థానాచార్యుడు ప్రవీణ్ పాటక్, ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి, వేద పండితుడు నవీన్‌శర్మ పాల్గొన్నారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహిస్తాం



తేనెను పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: తేనెటీగల పెంపకం చేపట్టే గిరిజన యువతకు ఐటీడీఏ ప్రోత్సాహం ఉంటుందని పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. బుధవారం సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ (సీడబ్ల్యూఎస్) సంస్థ ఆధ్వర్యంలో తేనెటీగల పెంపకంపై ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మూడురోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నాణ్యమైన తేనెకు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఉందని తెలిపారు. మంచి ఆదాయంతో పాటు 10మందికి ఉపాధి కల్పించవచ్చని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన గిరిజన యువతకు ఐటీడీఏ సహకారం అందిస్తోందని తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి సందీప్ మాట్లాడుతూ.. ఆసక్తి కలిగిన రైతులకు ఉద్యానశాఖ లేదా ఖాదీ విలేజ్ బోర్డు ద్వారా రాయితీలూ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. తేనెపట్టు నుంచి తేనె ఎలా సేకరించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూఎస్ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ట్రైనర్లు రమేశ్, శ్రీకాంత్, సిబ్బంది శ్యామల, అశోక్, తిరుపతి, డిగంబర్, కైలాస్, నాగోరావు, దివ్య, జ్యోతి తదితరులున్నారు.